

సత్యదేవునికి వెండి ఆభరణాల బహూకరణ

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం సత్యనారాయణ స్వామికి దాత వెండి ఆభరణాలను బహూకరించారు. గురువారం రాజమహేంద్రవరంకు చెందిన జిఆర్‌టి. ఓంప్రకాష్ స్వామివారికి వైదిక పూజలు నిర్వహించేందుకు అవసరమైన కేజీ బరువు గల వెండి ఆభరణాలను దేవస్థానం అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా అన్నవరం దేవస్థానం అధికారులు దాతకు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆభరణాలను అధికారులకు అందిస్తున్న దాత ప్రకాష్

కాకినాడ

- రేసులో సిట్టింగ్ ఎంఎల్ఎ ద్వారంపూడి
- కూటమి అభ్యర్థిపై కొనసాగుతున్న ఉత్కంఠ
- గెలుపు గుర్రం ఎవరో..?
- అందరి చూపు సిటీ నియోజకవర్గంపైనే

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

అతి సామాన్యుడి నుంచి ధనవంతుడి వరకు అందరూ హాయిగా బతకగలిగే నగరంగా, పెన్షనర్స్ పారడైజ్‌గా పిలువబడే కాకినాడ సిటీలో రాజకీయాలు కాక పుట్టిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఇక్కడి రాజకీయం మరింత హీటెక్కింది. అధికార, ప్రతిపక్షాలు వచ్చే ఎన్నికల్లో విజయం సాధించే లక్ష్యంగా వ్యూహాలు పన్నుతున్నారు. మరోసారి పట్టు నిలుపుకోవాలని అధికార పార్టీ ప్రయత్నాలు చేస్తుండగా అవినీతి, అరాచక పాలనకు చరమగీతం పాడాలని ప్రతిపక్షాలు ఎత్తులు వేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల ముంగిట ముందుగానే వైసిపి అధిష్టానం అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. సిట్టింగ్ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మళ్ళీ బరిలో నిలుచుంటున్నారు. ఈ నేపథ్యంలో కూటమి నుంచి అభ్యర్థి ఇంకా ఎవరనేది స్పష్టత రాలేదు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొందుతుందో అదే పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అనేది నానుడి. గత ఎన్నికల్లో 19కి గానూ 15 స్థానాల్లో వైసిపి విజయదుందుభి మోగించింది. ఫలితంగా వైసిపి అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను సాధించి మళ్లీ పాగా వేయాలని వైసిపి వ్యూహరచన చేస్తోంది. ప్రభుత్వంపై ఉన్న తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుని అధిక స్థానాలను సాధించాలని టిడిపి, జనసేన, బిజెపి కూటమి పావులు కదుపుతోంది. దీంతో కాకినాడ సిటీ నియోజకవర్గం రాజకీయాలు ఆశక్తికరంగా మారాయి. ఈ నియోజకవర్గంలోని 233 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,13,177 మంది పురుషులు, 1,23,166 మంది స్త్రీలు, 94 మంది ఇతరులు మొత్తంగా 2,36,437 మంది ఓటర్లున్నారు. ఈసారి జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలను అన్ని ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. జిల్లాల పునర్విభజన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో కాకినాడ జిల్లా కేంద్రానికి ప్రత్యేకత సంతరించుకుంది.



గెలుపు గుర్రం ఎవరో..?

సిటీ నియోజకవర్గంలో అధికార పార్టీ నుంచి ఉన్న ఎంఎల్ఎ ద్వారంపూడి సిఎం జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు కావడంతో ఆయన్ను ఢీకొట్టే బలమైన అభ్యర్థి కోసం టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రయత్నాలు చేస్తోంది. ద్వారంపూడి గత కొంతకాలంగా రాష్ట్రవ్యాప్తంగా వార్తల్లోకి ఎక్కారు. ఆయనపై అనేక అవినీతి, అక్రమాల ఆరోపణలతో ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతంలో జరిగిన వారాహి యాత్రలో ద్వారంపూడిపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు. చంద్రబాబు తన పర్యటనల్లో కూడా ద్వారంపూడి వ్యవహారాన్ని దుయ్యబెట్టారు. దీంతో సిటీ నియోజకవర్గంలో ద్వారంపూడిని ఎలాగైనా ఓడించి కూటమి విజయం సాధించాలని భావిస్తోంది. టిడిపి నుంచి మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబుకే టిక్కెట్ దక్కుతుందనే అభిప్రాయాలు ఆ పార్టీ శ్రేణుల నుంచి వినిప్తుంది. ద్వారంపూడికి సరైన ప్రత్యర్థి కొండబాబే అనే అభిప్రాయాలు లేకపోలేదు. అయితే ఆయన ఆశించిన స్థాయిలో ప్రతిపక్ష పాత్ర పోషించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. సిటీ నియోజకవర్గంలో ఎంఎల్ఎ అరాచక పాలన సాగిస్తున్నారని, కనపడిన చోటల్లా భూ కబ్జాలు చేస్తున్నారని, పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆస్తులను కైవసం చేసుకుంటున్నారంటూ సందర్భం వచ్చినప్పుడల్లా కొండబాబు ఆరోపణలు చేస్తున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో ద్వారంపూడిని ఓడించాలంటే కొండబాబుకి ఇప్పుడున్న బలం సరిపోదనే సంకేతాలు టిడిపి అధిష్టానానికి చేరాయి. అందుచేతనే కాకినాడ జిల్లాలో కూటమి అభ్యర్థులు అందర్నీ ప్రకటించినప్పటికీ సిటీ నియోజకవర్గ అభ్యర్థిపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. కొండబాబుకి కాకుండా ఆయన సోదరుడు కుమార్తె సుస్మితకు ఇస్తే ఎలా ఉంటుందని అంశంపై టిడిపి క్షేత్రస్థాయిలో సర్వేలు చేస్తుంది. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి కూడా టికెట్ ఆశిస్తూ గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. ఆయన పెద్దాపురం టిక్కెట్టు కోరినప్పటికీ చంద్రబాబు మూడోసారి కూడా చిన్నరాజప్పనే ప్రకటించడంతో నిరాశ చెందారు. సిటీ నియోజకవర్గంలోనైనా టికెట్ కేటాయించాలని పట్టుదలతో ఆయన చేయని ప్రయత్నాలు లేవని ప్రచారం సాగుతోంది. మరోవైపు ఉమ్మడి జిల్లాలో బిజెపి ఒక స్థానాన్ని కోరుతున్న నేపథ్యంలో కాకినాడ సిటీ నియోజకవర్గాన్ని తమకే ఇవ్వాలని పట్టు పడుతున్నట్లు సమాచారం. ఒకవేళ బిజెపికి గనుక అవకాశం ఇస్తే ఈ సీటును పోతుల విశ్వం, గట్టి సత్యనారాయణ, మాజీ ఎంఎల్ఎ ముత్తా గోపాలకష్ణ కుమారుడు ముత్తా నవీన్ కోరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఎవరికి సీటు దక్కుతుందో, ఉమ్మడి అభ్యర్థి ఎవరనేది త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తుంది.

24 గంటల్లో పోస్టర్లు, బ్యానర్ల తొలగింపు

ప్రజాశక్తి - కాకినాడ



జిల్లాలోని పలు ప్రభుత్వ ఆస్తులపై ఉన్న రాజకీయ ప్రకటనలకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు, ఫోటోలను 24 గంటల్లో తొలగించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రభుత్వ ఆస్తుల వద్ద రాజకీయ ప్రకటనలకు సంబంధించిన 30 వేల 947 తొలగించడం జరిగిందన్నారు. ప్రయివేట్ ప్రదేశాలలో ఉన్న వాల్ రైటింగ్లు, పోస్టర్లు, బ్యానెర్లు, హోర్డింగ్లు, జెండాలు వంటివి మొత్తం 10 వేల 119 తొలగించడం జరిగిందన్నారు. జిల్లాలో సివిజిల్ యాప్ ద్వారా 68 ఫిర్యాదులు అందాయని, అందులో 41 ఫిర్యాదులు డిఎస్‌సి పరీక్ష వాయిదా వేయాలని వచ్చాయని తెలిపారు. వాటిని డ్రాప్ చేయడం జరిగిందని, మరో 13 ఫిర్యాదులు సక్రమంగా లేవని, మిగిలిన 14 ఫిర్యాదులు ఆర్ఒలు పరిష్కరించడం జరిగిందని తెలిపారు. అందులో 13 ఫిర్యాదులు వంద నిమిషాల లోపల పరిష్కరించామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్నికలకు సంబం ధించి వివిధ రకాల అనుమతులు కొరకు 56 దర ఖాస్తులు రాగా అందులో 30 దరఖాస్తులకు అనుమ తులు మంజూరు చేశామని చెప్పారు. 11 దరఖాస్తులు తిరస్కరించగా, నాలుగు ప్రోగ్రెస్‌లో ఉన్నాయని, మరో 11 పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో వివిధ రాజకీయ పార్టీలు ప్రచారం చేసుకునేందుకు వచ్చిన అనుమతులలో డోర్ టు డోర్ కాన్వాసింగ్ చేసుకునేందుకు 20 దరఖాస్తులు, వెహికల్ పర్మిషనుకు 13 దరఖాస్తులు, లౌడ్ స్పీకర్‌తో వెహికల్ పర్మిషనుకు ఆరు, తాత్కాలిక పార్టీ కార్యాలయ ప్రారంభించేందుకు 4 దరఖాస్తులు, పాంప్లెట్లు పంపిణీ చేసేందుకు 2 దరఖాస్తులు, బ్యానర్లు ప్రదర్శించేందుకు 2 దరఖాస్తులు, వెహికల్ ఫర్ కాండిడేట్ అండ్ ఎలక్షన్ ఏజెంట్‌లకు 2 దరఖాస్తులు, ఇతర కారణాలకు 7 దరఖా స్తులు రావడం జరిగిం దని వివరించారు. జిల్లాలో 23.36 లక్షల విలువైన ఐటమ్స్‌ను సీజ్ చేయడం జరిగిందని, అందులో రూ.24 వేల నగదు, రూ.20.39 లక్షల విలువైన మద్యం, ఇతర ఐటమ్స్ 2.72 లక్షల విలువైన వస్తువులను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో పోలీస్ శాఖ ద్వారా రూ.3.51 లక్షలు, స్టేట్ గూడ్స్ అండ్ సర్విస్ టాక్స్/కమర్షియల్ టాక్స్ ద్వారా రూ.74 వేలు, ఇతర సంస్థల ద్వారా రూ.19.11 లక్షలు విలువైన వస్తువులు సీజ్ చేయడం జరిగిందని చెప్పారు. జిల్లాలో 324 ఆయుధాలకు అనుమతులు ఉండగా, అందులో 263 ఆయుధాలు డిపాజిట్ చేశారని, 61 ఎస్సెన్షియల్ సర్వీసులకు మినహాయింపు ఇవ్వడం జరిగిందని వివరించారు. జిల్లాలో 23 ఎఫ్ఎస్‌టి టీములు పనిచేస్తున్నాయని, మూడు అంతర రాష్ట్ర, 5 అంతర జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. గడిచిన 24 గంటలలో జిల్లాలో ఎక్సైజ్, ఎస్ఇబి శాఖల ద్వారా 21 ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 203.7 లీటర్ల అక్రమ మద్యాన్ని సీజ్ చేయడం జరిగిందని, 16 కేసులు బుక్ చేసి 11 మందిని అరెస్టు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

12 నెలల పిఎఫ్ వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - కాకినాడ

మెస్ వర్కర్స్‌కు తక్షణమే 12 నెలల పిఎఫ్‌ను చెల్లించాలని మెస్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం డిమాండ్ చేసింది. గురువారం యూనియన్ నాయకుడు వై.శంకర్ అధ్యక్షతన జిజిహెచ్‌లో మెస్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ పాల్గొని మాట్లాడారు. జిజిహెచ్‌లో మెస్ వర్కర్లుగా పనిచేస్తున్న కార్మికులకు కాంట్రాక్టర్ 12 నెలల నుంచి పిఎఫ్‌ను చెల్లించడం లేదన్నారు. 12 నెలల నుంచి చెల్లించవలసిన పిఎఫ్ బకాయి దాదాపు రూ.10 లక్షల వరకూ ఉంటుందని అన్నారు. ఈనెల 31వ తేదీతో ప్రస్తుత కాంట్రాక్టర్ గడువు పూర్తివుతుందని, ఈలోగానే కాంట్రాక్టర్ చెల్లించాల్సిన పిఎఫ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ పిఎఫ్ చెల్లించకపోతే జిజిహెచ్ అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి వారికి ఇవ్వాల్సిన బిల్లును నిలుపుదల చేసి పిఎఫ్ సొమ్ము చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనపర్తి ఏడుకొండలు, వీరబాబు, శ్రీను, భద్రరావు, కృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి: సిపిఎం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అకాల వర్షాల వల్ల నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని సిపిఎం డిమాండ్ చేసింది. బుధవారం కురిసిన వడగళ్ళ వర్షం, భారీ గాలులకు విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కల్గింది. ఈ నేపథ్యంలోనే సిపిఎం నాయకులు గురువారం ఆయా ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా చింతపల్లి అజయ్‌కుమార్ మాట్లాడుతూ అకాల వర్షం కారణంగా తూరంగి బొడ్డు చెరువు ప్రాంతంలో హెవీ విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగిపోయాయని అన్నారు. కొన్ని స్తంభాలు విరిగి పడిపోయాయని తెలిపారు. విద్యుత్, పంచాయతీరాజ్, డ్రెయినేజీ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదన్నారు. హెవీ విద్యుత్ స్తంభాలు కొన్ని నేలకు ఒరిగి పోయాయని, కొన్ని ఒరిగిపోయి పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రమాదకర పరిస్థితుల్లో విద్యుత్ స్తంభాలు ఉన్నా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. అధికారులు యుద్ధప్రాతిపదికన తగు చర్యలు తీసుకుని విద్యుత్ సరఫరాను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో జోగా అప్పారావు, టి.సుబ్బారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్

పోలీసులకు సహకరించాలి: ఎస్‌పి

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల ప్రవ ర్తన నియమావళి అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోటీ చేసే అభ్యర్థులు పోలీసులకు సహ కరించాలని ఎస్‌పి ఎస్. సతీష్ కుమార్ సూచిం చారు. గురువారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల ప్రతినిధులు పలు సందేహాలను వ్యక్తం చేశారు. ఆ సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో పోటీ చేసే రాజకీయ పార్టీల ప్రతినిధులకు పోలీసు శాఖ నుంచి కావాల్సిన వివిధ అనుమతులను సువిధ యాప్ ద్వారా పొందే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ నుంచి అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. నిత్యం జిల్లా పోలీసు కార్యాలయ కంట్రోల్ రూంకు అనుసంధానం కాబడిన ఫోన్ నంబర్లకు ఎన్నికల ఫిర్యాదులు చేయవచ్చని, అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కరప



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ ఇట్ల కిషోర్

కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అమలు చేసే నియామవళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన ఈ సదస్సులో ఆర్‌డిఒ ఇట్ల కిషోర్ పాల్గొని మాట్లాడారు. రాజకీయ పార్టీల ఎన్నికల కార్యాలయాలకు అనుమతులను దేవాలయాలు, చర్చిలు, మసీదులు, పాఠశాలలు, పోలింగ్ స్టేషన్లకు 200 మీటర్ల దూరంలో ఉండేలా ఇవ్వాలన్నారు. గతంలో తొలగించిన ప్రచార సామాగ్రి తిరిగి ప్రచారానికి వినియోగించేందుకు అవకాశం ఇవ్వరాదని తెలిపారు ఎన్నికల ప్రచారం, కార్యాలయ నిర్వహణ, సభలు, సమావేశాలు, వాహనాల వినియోగం, మైక్‌సెట్ వినియోగానికి సంబంధించి ముందుగానే రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి తీసుకోవాల్సివుందన్నారు. వాటర్ ట్యాంకులు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయ భవనాలు, ఆరోగ్య కేంద్రాల ప్రారంభోత్సవాల సందర్భంగా ఏర్పైన రాజకీయ పార్టీ జెండాల రంగులు ఉన్నట్లు గుర్తిస్తే తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేములవాడ సర్పంచ్ భర్త కె. భీమశంకర్ తమ వాటర్ ట్యాంకునకు వైసిపి రంగుల మాదిరిగా నీలం, తెలుపు రంగులు ఉన్నాయని, తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒను కోరారు. వైసిపికి సంబంధించి మూడు రంగులు కల్గివుంటేనే తొలగించడం జరుగుతుందని ఆర్‌డిఒ తెలిపారు.



ప్రింటర్స్ సమావేశంలో మాట్లాడుతున్న సిటి రిటర్నింగ్ అధికారి వెకంటరావు

ముద్రణ సమాచారాన్ని కచ్చితంగా ఇవ్వాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల ప్రచారం కోసం వివిధ రాజకీయ పార్టీలు ముద్రించే ఫ్లెక్స్‌లు, కరపత్రాలు, స్టిక్కర్లు, ఇతర ప్రచార సామాగ్రికి సంబంధించి ఖచ్చితమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తమకు తెలపాలని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు కోరారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఫ్లెక్స్, ఆఫ్‌సెట్ ప్రింటర్లు, ఇతర ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసేవరకు ఏ ఒక్కరూ ప్రింటింగ్‌కు ఆర్డర్ ఇచ్చిన అందుకు సంబంధించి అనుసరించాల్సిన మార్గదర్శకాలను వివరించారు. ప్రింటింగ్ కోసం వచ్చిన సంస్థ, వ్యక్తి ఎవరు? ఏ తేదీన ఆర్డర్ ఇచ్చారు? ఎంత ఆర్డర్ ఇచ్చారు? వంటి సమాచారానికి సంబంధించి ప్రొఫార్మాను నింపి సంతకాలు తీసుకుని సమగ్రమైన వివరాలతో కలెక్టరేట్, ఆర్వో కార్యాలయానికి ఖచ్చితంగా ఎప్పటికప్పుడు అందజేయాలని స్పష్టం చేశారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆయా ప్రింటింగ్ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ప్రతీ ఒక్కరూ పాటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్లెక్స్ ప్రింటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.వెంకట్, మహేష్, శ్రీను, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సీతాపతిరావు పాల్గొన్నారు.

టిడిపిలోకి గోవలంక సర్పంచ్

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలానికి చెందిన గోవలంక సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ తన అనుచరులతో కలిసి టిడిపిలో చేరారు. గురువారం టిడిపి నాయకుడు సాగి బాబ్జిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు పాల్గొని పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు.



సర్పంచ్‌ని పార్టీలోకి ఆహ్వానిస్తున్న దాట్ల

ఈ కార్యక్రమంలో చెల్లి వివేకానంద, మోపురి వెంకటేశ్వరరావు, వేగేశ్న భాస్కర్‌రాజు, బోయిడి వేణుగోపాల్, జక్కల ప్రసాద్‌బాబు మాట్లాడారు.

మడ అడవుల రక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - తాళ్లరేవు

మడ అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ అన్నారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా కోరంగి హైస్కూల్లో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే మడ అడవులు వల్ల లాభాలను విద్యార్థులకు వివరించారు. మడ అడవులను నరకవద్దని వాటిని సంరక్షించడానికి విద్యార్థి దశ నుంచే కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా హైస్కూల్లో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బంది నాగార్జున, వీరభద్రరావు, గోపీ నాగేంద్రకుమార్, మహేష్, ధనుంజయ రావు, సుభాని, సంధ్యారాణి , హైస్కూల్ హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధికారులు



హుండీ లెక్కింపులో అధికారులు, సిబ్బంది

హుండీల ఆదాయం రూ.1.66 లక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ ఆలయ హుండీలను గురు వారం లెక్కించగా రూ.1,66, 797 ఆదాయం సమకూరిం దని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్. రామమో హన్‌రావు తెలిపారు. దేవా దాయ ధర్మాదాయ శాఖ పెద్దాపురం డివిజనల్ ఇన్ స్పెక్టర్ చల్లా ఉదయబాబు నాయుడు, కాండ్రకోట నూకాలమ్మ దేవస్థానం ఇఒ టి.సూర్య నారాయణ ల సమక్షంలో 41 రోజులకు సంబంధించిన హుండీలను తెరిచి లెక్కింపు జరిపారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, వేద పండితులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - గండేపల్లి

క్రీడలు శారీరక, మానసిక వికాశానికి దోహదం చేస్తాయమని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ ప్రాంగణంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో 'ట్రైఆథ్లోన్' పేరిట క్రీడలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవెంట్‌లో 100 మీటర్ల స్ప్రింట్ (రన్నింగ్), హైజంప్, లాంగ్ జంప్, షాట్ పుట్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో ప్రతిభను కనబరిచిన వారికి బహుమతులు ఇస్తామన్నారు. విద్యార్థులలో క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకే ఆదిత్య యాజమాన్యం ఈ క్రీడలను నిర్వహిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి తన దినచర్యలో తప్పనిసరిగా క్రీడలకు కొంత సమయాన్ని కేటాయించాలని పిలుపునిచ్చారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి జివి.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి సంవత్సరం విద్యార్థులకు మాత్రమే ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వారిలో క్రీడా నైపుణ్యాన్ని, ప్రతిభను గుర్తించి సాన పెట్టేందుకే ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి రూపొందించారని చెప్పారు. విజేతలకు స్మార్ట్ వాచ్‌లు, లాప్‌టాప్ బాగ్‌లు, వాటర్ బాటిల్‌లు బహుమతులుగా అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ డాక్టర్ డోలా సంజయ్, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, ఫిజికల్ డైరెక్టర్స్, క్రీడాకారులు పాల్గొన్నారు.



హైజంప్‌లో పాల్గొన్న విద్యార్థి

నష్ట పరిహారం రూ.30 లక్షలు ఇవ్వాలి



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు, రైతు కూలీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

లలిత ఇండస్ట్రీస్‌లో జరిగిన లారీ ప్రమాదంలో మరణించిన మహిళా కార్మికుల ఒక్కొక్క కుటుంబానికి రూ.30 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ఎఐఎఫ్‌టియు, ఎపిఆర్‌సిఎస్ డిమాండ్ చేశాయి. గురువారం స్థానిక పులిమేరు దమ్ముపేటలో అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, ఎపి రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం భద్రతా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం కారణంగానే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పరిశ్రమలలో ప్రమాదాల వల్ల అనేకమంది కార్మికులు మృతి చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా యాజమాన్యాలు పరిశ్రమల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని, భద్రతా చర్యలను కార్మిక శాఖ అధికారులు పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కుంచె అంజిబాబు, ఎపిఆర్‌సిఎస్ జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, డి సురేష్, సత్తిబాబు, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరిమి పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను సొసైటీ మాజీ అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు పరిమి బాబు పరామర్శించారు. ఇటీవల గండేపల్లి జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో లక్ష్మీకుమారి మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని, అలాగే రాజానగరం మండలం గానుగూడెం వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన పిల్లి లవకుమారి కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో బిత్తిన గంగాధర్, సుంకవల్లి రమేష్ పాల్గొన్నారు.



మృతిని కుటుంబాన్ని పరామర్శిస్తున్న పరిమిబాబు

వేడెక్కిన రాజోలు రాజకీయం

మారుతున్న రాజకీయ సమీకరణాలు
మాజీ మంత్రిని ఢీ కొట్టనున్న మాజీ ఐఎఎస్
గెలుపుపై ఇరుపార్టీల ధీమా

ప్రజాశక్తి- రాజోలు


అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాజోలు నియోజకవర్గంలో రాజకీయాలు హీటెక్కాయి. జిల్లాలో చివరి నియోజకవర్గం రాజోలులో రాజకీయం ఆసక్తికరంగా మారింది. కొద్ది రోజులుగా నియోజకవర్గాల్లో మార్పులు, చేర్పులు చేస్తున్న వైసిపి అధిష్టానం రాజోలు సీటుపై క్లారిటీ ఇచ్చింది. 2019 ఎన్నికలలో జనసేన నుంచి పోటీ చేసి గెలిచిన రాపాక వరప్రసాదరావుకు అవకాశం ఇవ్వకుండా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు టిడిపిని వీడి వైసిపిలోకి చేరడంతో ఆయనకు సీటు ఇచ్చారు. రాజకీయ బద్ధశత్రువులైన రాపాక, గొల్లపల్లి ఒక్కటై 2024లో ఒకరు ఎంఎల్ఏగా మరొకరు అమలాపురం ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగనున్నారు.

గెలుపుపై వైసిపి ధీమా

2014 సార్వత్రిక ఎన్నిల్లో రాజోలులో టిడిపి అభ్యర్థిగా గెలిపొందిన గొల్లపల్లి సూర్యారావు 2019లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. మరలా 2024లో టిడిపి నుంచి సీటు ఆశించినప్పటికీ పొత్తులో భాగంగా తనకు సీటు ఇవ్వకపోవడంతో వైసిపిలో చేరిన గొల్లపల్లి కొద్ది రోజుల వ్యవధిలోనే రాజోలు ఎంఎల్ఎ అభ్యర్థిగా సీటు తెచ్చుకుని తన రాజకీయ ఎత్తుగడకు తెరలేపారు. మొదట గొల్లపల్లికి రాపాక సహకారం లేకపోవడం మిగిలిన అసంతృప్తి వర్గం గొల్లపల్లికి జై కొట్టడంతో అధిస్టానం ఆదేశాల మేరకు రాజోలు ఎంఎఎల్ఎ రాపాక వరప్రసాద్ కూడా గొల్లపల్లిని గెలిపించాలని అన్ని మండలాల శాఖలకు సమాచారం ఇవ్వడంతో వైసిపి కేడర్ మొత్తం ఒకతాటి పైకి వచ్చింది. దీనికి తోడు రాజోలు నియోజకవర్గంలో పదేళ్లుగా గొల్లపల్లి సుపరిచితుడు కావడం ఆయనకు కలిసి వచ్చే అంశంగా చెబుతున్నారు.

జనసేన పార్టీలో వర్గపోరు...!

రాజోలు నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో జనసేన అభ్యర్థి రాపాక వరప్రసాద్ గెలవడం రాష్ట్రంలో ఒకే ఒక్క సీటు రాజోలు కావడంతో రాజోలు నియోజకవర్గంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగింది. ప్రస్తుతం పొత్తు నేపథ్యంలో జనసేనకు సీటు కేటాయించడంతో ఆ పార్టీ అభ్యర్థిగా రిటైర్డ్ ఐఎఎస్ దేవ వరప్రసాద్ పేరును ప్రకటించారు. దీంతో జనసేన పార్టీలో వర్గపోరు మొదలైంది. టికెట్ ఆశించి వైసిపి నుంచి రెండుసార్లు పోటీ చేసి ఓడిపోయిన బొంతు రాజేశ్వరరావు తన వర్గం బొంతుకే సీటు కేటాయించాలని చేసిన రచ్చ ఇంతా అంతా కాదు. నాలుగేళ్ల నుంచి పార్టీలో పని చేస్తు జనసేనకు మైలేజీ తీసుకొచ్చిన చింతలమోరి సర్పంచ్ డాక్టర్ రమేష్ బాబు తనకు సీటు వస్తుందని ఆశించారు. అధిస్టానం ఎ.నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని తెలుపడంతో రమేష్ బాబుపై పార్టీలో సానుకూలంగా ఉన్నారు. ప్రత్యర్థి రాజకీయ కురవద్ధుడు గొల్లపల్లిని ఢీ కొట్టాలంటే టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థికి వర్గపోరు లేకుండా ఉంటేనే 2019 ఫలితం పునరావృతమవుతుందని అంటున్నారు.


గొల్లపల్లి సూర్యారావు


దేవ వరప్రసాద్

నేరాలు ఘోరాలు

స్పా సెంటర్‌పై పోలీసుల దాడి

ప్రజాశక్తి - కాకినాడ

బాడీ మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న ఈశా స్పా సెంటర్‌పై పోలీసుల బుధవారం అర్ధరాత్రి దాడి నిర్వహించారు. దీనికి సంబంధించి టూ టౌన్ సిఐ తెలిపిన వివరాలు..స్థానిక భానుగుడి జంక్షన్ ప్రాంతంలో కోటగిరి సిటీ సెంటర్ కాంప్లెక్స్‌లో ఉన్న ఈశా స్పా సెంటర్‌లో వ్యభిచారం జరుగుతుందనే సమాచారం రావడం జరిగిందన్నారు. దీంతో బుధవారం రాత్రి దాడి చేయగా కోల్‌కత్తాకు చెందిన ఒక మహిళ, ఇద్దరు విటులు, ఇద్దరు స్పా సెంటర్ నిర్వాహకులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గురువారం కోర్ట్‌కు తరలించగా ఈశా స్పా సెంటర్ నిర్వాహకులను 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారన్నారు. స్పా, బ్యూటీ పార్లల్, సెలూన్‌లపై ప్రత్యేక నిఘా ఉంటుందని క్రాస్ మసాజ్, వ్యభిచారం చేసేవారికి చట్టప్రకారం జైలు తప్పదని ఆయన హెచ్చరించారు.

కోడిపందేలపై దాడులు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని వసంతవాడ, ఆత్రేయపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడిపందేలపై ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ గురువారం తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.900, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నారు. ఆత్రేయపురం గ్రామ శివారున ఒకరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.600, ఒక కోడి, కోడి కత్తులను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎపై తెలిపారు.

20 బైకుల రికవరీ


ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

చోరీలకు గురైన 20 బైకులను పోలీసులు రికవరీ చేశారు. ఎస్పి పి.జగదీష్ ఆదేశాల మేరకు సెంట్రల్ జోన్ డిఎస్పి కె.విజయ్‌పాల్ పర్యవేక్షణలో రాజమహేంద్రవరం 3వ పట్టణ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ప్రసన్నవీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో బైకుల చోరీలపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. చోరీలకు గురైన కొద్దిరోజుల్లోనే ఈ బృందం 20 బైకులను రికవరీ చేసింది. 1వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో 4, ప్రకాష్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో 3, 3వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో13 మొత్తంగా 20 బైకులను స్వాధీనం చేసుకున్నారు. గురుఆరం మధ్యవర్తుల సమక్షంలో రాజమహేంద్రవరం క్వారీ సెంటర్ వద్ద మోటార్ సైకిళ్లను, చోరి చేసిన నిందితులను, చాకచక్యం గా పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ బైకులను చోరీ చేసిన నిందితుల్లో బాలురే ఎక్కువగా ఉన్నారన్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకొన్న ప్రత్యేక టీం ఎస్ఐ యువిఎస్.నాగబాబు, హెచ్‌సి పి.వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు బి.విజయ్‌కుమార్, టివి.సత్యనారాయణలను అభినందించి, క్యాష్ రివార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి(లా అండ్ ఆర్డర్) అనిల్‌కుమార్, డిఎస్‌పి కె.విజయపాల్, సిఐ ఎస్.వీరయ్యగౌడ్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం గ్రామ శివారు పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,420 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. నిందితులను అరెస్టు చేస్తామని కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఎస్సై టి రామకృష్ణ తెలిపారు.


పిఠాపురం రోడ్డులో కాలువలోకి వదులుతున్న వ్యర్థాలు

ఏలేరు జలాల్లోకి యథేచ్ఛగా సెప్టిక్ వ్యర్థాలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మండల పరిధిలోని ఏలేరు జలాల్లోకి యధేచ్ఛగా సెప్టిక్ ట్యాంకుల వ్యర్థాలను విడుదల చేస్తున్నారు. తాజాగా పిఠాపురం రోడ్డులో గల ఏలేరు కాలువలోకి సెప్టిక్ ట్యాంక్ నుంచి వ్యర్థాలను యధేచ్ఛగా విడుదల చేస్తున్నారు. ఈ కారణంగా పిఠాపురం రోడ్డులో ప్రయాణించే ప్రజలు దుర్వాసన బారిన పడుతున్నారు. ఇటీవల పంట కాలువలలో మండల పరిధిలో ఎక్కడపడితే అక్కడ సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను కాలులలోకి వదులుతున్న అధికారులు వారిపై చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి సెప్టిక్ ట్యాంక్ నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి తగు చర్యలు చేపట్టాలని, ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వాడపర్తి మద్దతు కోసం..

ప్రజాశక్తి - సామర్లకోట

గత కొంతకాలంగా పార్టీకి దూరంగా ఉంటున్న స్థానిక వైసిపి నాయకుడు వాడపర్తి వీరభద్రరావును వైసిపి నాయకులు కలిసి మద్దతు కోరారు. స్థానిక గణపతి నగరం ప్రాంతంలో గల భద్రరావు ఇంటికి వైసిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్ తదితరులు వెళ్లి కలిశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో స్థానికుడు దవులూరి దొరబాబుకి టికెట్ వచ్చినందున పెద్దాపురం నియోజవర్గం వైసిపి విజయానికి కృషి చేయాలని భద్రరావు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవాల లక్ష్మీనారాయణ, పాగా సురేష్ కుమార్, నేతల హరిబాబు, జట్ల మోహన్, మద్దాల శ్రీను, దూది రాజు పాల్గొన్నారు.

బాల్య వివాహం నేరం

రౌతులపూడి :బాల్య వివాహం చేయడం నేరమని ఐసిడిఎస్ సిడిపిఒ పద్మావతి అన్నారు. మండలంలోని రాజవరం గ్రామంలో బాల్య వివాహం జరుగుతుందని వచ్చిన సమాచారంతో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, విఆర్ఒ సరస్వతిలతో కలిసి ఆమె గ్రామాన్ని సందర్శించి ఆ వివాహాన్ని నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా బాల వివాహాలపై గ్రామంలో అవగాహన కల్పించారు. బాల్య వివాహం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సామర్లకోటలో కూటమి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పూర్ణ కళ్యాణ మండపంలో గురు వారం రాత్రి టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. టిడిపి పెద్దాపురం నియోజక వర్గ అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షతన ఆత్మీయ సమావే శం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ తుమ్మల బాబు, బిజెపి నాయకుడు వెంకట రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజప్ప మాట్లాడుతూ ఎలాంటి బేధం లేకుండా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలకు సమాన ప్రాధాన్యతను ఇస్తూ ముందుకు తీసుకెళ్ళతానని అన్నారు. గ్రామాలు, పట్టణాలన్నిటికీ అభివృద్ధి విషయంలో ఇతర విషయాల్లో సమాన ప్రాధాన్యత ఇవ్వనున్నందున కూటమి విజయానికి కూటమి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. తుమ్మల బాబు, వెంకటరమణ మాట్లాడుతూ ఎంతటి పెద్ద నాయకుడైనా కార్యకర్తలే పార్టీకి ప్రాణం అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం, మహిళలపై దాడులు, హత్యలు వంటి ఇబ్బందులను అరికట్టేందుకు కూటమిని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు సుంకవిల్లి బాపిరాజు, తుమ్మల పద్మజ, రాజా సూరిబాబు రాజు, అందుగుల జార్జి చక్రవర్తి, లక్ష్మణ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చినరాజప్ప, బాబు

ఎన్నికల నియమావళిని అనుసరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు ఎన్నికల నియామవళిని అనుసరించాలని ఆర్‌డిఒ జె.సీతా రామా రావు సూచించారు. గురువారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో డిఎస్‌పి లతా కుమారితో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, వీడియో గ్రాఫర్స్, పోలీసు సిబ్బందితో ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు 4 టీములు, ఫ్లయింగ్ స్క్వాడ్ 3 టీములు, సర్వ లెన్స్ 2 టీములు, ఎస్-ఎస్‌టి 3 టీములు, 22 మంది సెక్టార్, 22 మంది రూట్ ఆఫీసర్లు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎవరైనా ఫిర్యాదు చేయాలంటే ఆర్‌డిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, పద్మావతి, ఉషారాణి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సీతారామారావు

పొన్నాడలో పర్యటించిన ఎంపీ గీత

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని పొన్నాడ గ్రామంలో ఎంపీ వంగా గీత పర్యటించారు. గురువారం పంచాయతీ పరిధిలోని రావివారిపోడులో ఉన్న మహాలక్ష్మి అమ్మవారిని ఆమె దర్శించుకున్నారు. అనంతరం ఆమె గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ పాలనలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందని అన్నారు. ప్రతిపక్షాలు వారి పాలనలో చేసింది ఏమిటో చెప్పు కోలేని పరిస్థితిలో ఉన్నాయన్నారు. వైసిపి పాలనపై బురద చల్లేందుకు కుట్రలు సాగిస్తున్నాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపికి ఓటును వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి రాణి, ఎంపిటిసి సభ్యులు జ్యోతుల వాణి, ఎంపిపి కారే సుధా, జడ్‌పిటిసి తులసి, వైస్ ఎంపిపిలు మాదిరెడ్డి దొరబాబు, సురేష్ కుమార్ పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న వంగా గీత

మండలంలో జ్యోతుల విస్తృత పర్యటన

ప్రజాశక్తి - గండేపల్లి

టిడిపి జగ్గం పేట నియోజకవర్గ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ మండ లంలో విస్తృతంగా పర్యటిం చారు. గురువారం మండలం లోని సూరంపాలెం, నాయ కంపల్లి, యల్లమిల్లి, గండే పల్లి, మల్లేపల్లి, మురారి, రామయ్యపాలెం, సింగరం పాలెం, సుబ్బయమ్మపేట, తాళ్లూరు, నీలాద్రిరావుపేట గ్రామాల్లో పర్యటించిన ఆయన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ కూటమిలో ఉమ్మడి అభ్యర్థిగా నన్ను ప్రకటించడం జరిగిందని, మీ అందరి సహకారంతో ఈ ఎన్నికల్లో నన్ను గెలిపించాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందన్నారు. టిడిపి శ్రేణులకు ఎంత ప్రాధాన్యత ఇస్తానో జనసేన, బిజెపి శ్రేణులకు అంతే ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్ అప్పలరాజు, బుదిరెడ్డి శ్రీనివాస్, సూరంపాలెం బాలు, సింగలూరి రామ్ దీపు, పోతుల మోహనరావు, పరిమి బాబు, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, కోర్పు సాయితేజ, జాస్తి వసంత్ పాల్గొన్నారు.


జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల

గడప గడపకూ వైసిపి ప్రచారం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ఎం.చామవరం గ్రామంలో వైసిపి కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, వైసిపి ప్రత్తిపాడు అసెంబ్లీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు గురువారం గడప గడపకూ వైసిపి కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో వారు ప్రజలను కలుసుకుని వైసిపి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికలలో వైసిపికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గొల్లి లక్ష్మణ్‌మూర్తి, వైసిపి మండల అధ్యక్షుడు తాతాజీ, నాయకులు వై.సురేష్‌బాబు, ఎ.మురళి, పంతం బాబ్జి పాల్గొన్నారు.

ప్రచార వాహనాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - పిఠాపురం

ఎన్నికల ప్రచార వాహనాలకు అనుమతి తప్పనిసరి అని రిటర్నింగ్ అధికారి జెసి ఎస్. రామసుం దర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నియమావళిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నీ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల్లో ప్రచారం నిర్వహించే వాహనాలకు తప్ప నిసరిగా అనుమతి తీసుకోవా లన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సింగిల్ విండో సెల్ నందు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనుమతులు లేని వాహనాలు ఎన్నికల ప్రచారంలో ఉపయోగించారదని, నిబంధనలను అతిక్రమించి వినియోగిస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. సీజ్ చేసిన వాహనాలు తిరిగి కోర్ట్ ఉత్తర్వులు ద్వారా మాత్రమే విడుదల చేయబడతాయన్నారు. సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెసి, రిటర్నింగ్ అధికారి రామసుందర్ రెడ్డి

జోరుగా ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - కరప

మండలంలోని వేములవాడ పంచాయతీలోని సిరిగలపల్లి లంక గ్రామంలో జనసేన అభ్యర్థి పంతం నానాజీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ నియోజకవర్గ టిడిపి కోఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత ప్రజలు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఓటర్లను అభ్యర్థిస్తున్న నానాజీ, పిల్లి దంపతులు

పలు ఆలయాల్లో దొరబాబు పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలో జరిగిన పలు పూజా కార్యక్రమాల్లో గురువారం వైసిపి పెద్దాపురం నియోజవర్గం అభ్యర్థి దవులూరి దొరబాబు పాల్గొన్నారు. వేట్లపాలెం గ్రామంలో సోమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన కళ్యాణంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ దొరబాబుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అలాగే పండ్రవాడ శివాలయం, పెద్ద బ్రహ్మదేవుని గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయ జాతర మహోత్సవాలో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిటిసి సభ్యులు మలకల సూర్యారావు, వైవిబి.ప్రసాద్‌రావు, సొసైటీ అధ్యక్షుడు మలకల వరాలబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.


కోలాటం బృందంతో దొరబాబు

ఎన్నికల ప్రచారానికి ద్వారంపూడి శ్రీకారం

ప్రజాశక్తి - కాకినాడ

ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి గురువారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మత్స్యకార ప్రాబల్యం అధికంగా ఉండే 15వ డివిజన్ ఏటిమొగ ప్రాంతం నుంచి తన ప్రచారాన్ని ప్రారంభించారు. తొలుత ములేరమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మహిళతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ద్వారంపూడి

యానాం వార్తలు



కీర్తి పురస్కారం అందుకుంటున్న దేవదానం రాజు

కీర్తి పురస్కారం అందుకున్న దాట్ల

ప్రజాశక్తి - యానాం

ప్రముఖకవి, కథకుడు దాట్ల దేవదానంరాజుకు హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన సభలో సృజనాత్మక సాహిత్యంలో 'దాట్ల'కు కీర్తి పురస్కారాన్ని ప్రదానం చేశారు. సభలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య టి.కిషన్‌రావు, మెట్రో రైల్ ఎండి ఎన్‌విఎస్.రెడ్డి, రిజిస్ట్రార్ భట్టు పురస్కారాన్ని అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా దాట్లకు ప్రముఖకవి శిఖామణి, కవులు ముమ్మిడి చిన్నారి, పొనుగుమట్ల అశోక్‌కుమార్ అభినందనలు తెలిపారు.

వైభవంగా వెంకన్న కల్యాణ మహోత్సవం


కల్యాణోత్సవంలో పాల్గొన్న గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సతీమణి లక్ష్మీ స్నేహ

ప్రజాశక్తి - యానాం

మీసాల వెంకన్న కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. గురువారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవంలో మహోత్సవంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, లక్ష్మీస్నేహ దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా యానాం ప్రజల పక్షాన ఎంఎల్ఎ దంపతులు స్వామికి ముత్యాల తలంబరాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ కుటుంబీకులు, భక్తులు పాల్గొని స్వామి కళ్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - యానాం

యానాం రీజన్సీ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపు కార్యక్రమంలో గురువారం స్థానిక మెట్టకూరు వాటర్ ట్యాంక్ పరిసరప్రాంతంలో వాలంటీర్లు స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో చెత్తా చెదారం, తుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.వీరకుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ జరిగింది. ఆదేవిధంగా కళాశాలలో మధ్యాహ్నం నాయకత్వ లక్షణాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కళాశాల జువాలజి అధ్యాపకులు సిహెచ్.ఆనంద్‌కమార్ మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ పిఒ వీరకుమార్ పాల్గొన్నారు.

24 న ప్రపంచ కవితా దినోత్సవ సభ

ప్రజాశక్తి - యానాం

కవిసంధ్య, భాషా సాంస్కృతిక శాఖ, హైదరాబాద్ సౌజన్యంతో ఈనెల 24 సాయంత్రం హైదరాబాద్ రవీంద్ర భారతి సమావేశ మందిరంలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు కవిసంధ్య అధ్యక్షుడు ప్రముఖకవి డాక్టర్ శిఖామణి తెలిపారు. ఈ సందర్భంగా కవిత్వంపై కొప్పర్తి ప్రత్యేక ప్రసంగం, కవితల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం, కవి సంధ్యపత్రిక, కవిత్వ గ్రంథాల ఆవిష్కరణ, కవి సమ్మేళనం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. శిఖామణి అధ్యక్షతన జరిగే సభలో కె.శివారెడ్డి, వాడ్రేవు చిన వీరభద్రుడు, దాట్ల దేవదానంరాజు డానియెల్ నెజర్స్, మామిడి హరికృష్ణ, శీలా సుభద్రాదేవి, సుధామ, యార్లగడ్డ రాఘవేంద్రరావు, ఆంజనేయ శర్మ, సిఎస్.రాంబాబు, చల్లా రామఫణి తదితరులు పాల్గొంటారని తెలిపారు.
